

విఘ్నేశ్వరాయ విభిన్న రూపాయ 2



జాతర ఉత్సవాలకు పోటెత్తిన భక్తులు 2

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in



## ప్రాణాలు పణంగా పెట్టి చేపల వేట

నిజాంసాగర్ ప్రాజెక్టు వద్ద మత్స్య కార్మికులు ప్రాణాలను పణంగా పెట్టి చేపల వేట సాగిస్తున్నారు. వరద గేట్లను మూసివేయడంతో స్థానికులతో పాటు కార్మికులు వేట కోసం ప్రాజెక్టులోకి దిగారు. ఓ వైపు వరద ప్రవాహం కొద్దిమేర కొనసాగుతున్నా వేట కొనసాగిస్తున్నారు.
– అక్షరటుడే, నిజాంసాగర్





## శ్రీరాంసాగర్‌లోకి కొనసాగుతున్న వరద..

**అక్షరటుడే, ఆర్మూర్:** శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీగా వరద వస్తోంది. దీంతో అధికారులు నీటి విడుదలను పెంచారు. ప్రస్తుతం ప్రాజెక్ట్ 39 వరద గేట్ల ద్వారా 5.96 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్‌కు ఎగువ నుంచి ప్రస్తుతం 4.90 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. మహారాష్ట్రతో పాటు స్థానికంగా కురిసిన వర్షాలతో గోదావరి ఉధృతంగా పారుతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు (1091 అడుగులు ) కాగా ప్రస్తుతం 58.97 టీఎంసీల (1084.70 అడుగులు) నీరు నిల్వ ఉంది. శ్రీరామ్‌సాగర్ నుంచి ఎస్కేప్ గేట్ల ద్వారా 8 వేల క్యూసెక్కులు, వరద కాలువ ద్వారా 12,300, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు వదులుతున్నారు. గోదావరిలోకి భారీగా నీటిని విడుదల చేస్తుండటంతో నది పరీవాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాజెక్ట్ ఏఈఈ కొత్తరవి సూచించారు.



## ధర్మపురి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావసరాల అందజేత

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లాలో కొన్ని రోజులుగా కురిసిన భారీ వర్షాలతో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా సిరికొండ, ధర్పల్లి, ఇందల్వాయి మండలాల్లో వర్షాలు, వరదల కారణంగా తీవ్ర నష్టం వాటిల్లింది. దీంతో నిరాశ్రయులైన ప్రజలకు నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి తన ఫౌండేషన్ ద్వారా అండగా నిలిచారు. ధర్మపురి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం 500 నిత్యావసర కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, మండలాధ్యక్షులు, పార్టీ కార్యకర్తల చేతుల మీదుగా నిరాశ్రయులైన ప్రజలకు నిత్యావసర కిట్లను అందించారు.

## ఆదర్శ పాఠశాలలో స్పాట్ అడ్మిషన్లు

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి నుంచి 11వ తరగతి వరకు ఖాళీలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తోట గాంధీ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. వచ్చేనెల 1వ తేదీన సోమవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నందున ఆసక్తి గల విద్యార్థులు నేరుగా పాఠశాలకు రావాలని సూచించారు.

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి గోదావరిలోకి నీటి విడుదలను పెంచడంతో దూదిగాం శివారులో నీట మునిగిన పంటలు





# వర్షం మిగిల్చిన నష్టం

▸ కుండపోత వానలతో ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల రోడ్లు ధ్వంసం ▸ వేల ఎకరాల్లో పంట నష్టం ▸ నేలకూలిన విద్యుత్ స్తంభాలు

**భారీ వర్షా లతో ఉమ్మడి జిల్లాకు తీవ్ర నష్టం వాటిల్లింది. మంగళవారం రాత్రి నుంచి గురువారం వరకు ఉమ్మడి జిల్లాలో వర్షం బీభత్సం సృష్టించింది. దీంతో వాగులు, నదులు ఉప్పొంగి ప్రవహించాయి. ఎక్కడా చూసినా నీరే కనిపించింది. వరద ఉధృతికి పలు చోట్ల రోడ్లు ధ్వంసం అయ్యాయి. వేల ఎకరాల్లో పంటలు కొట్టుకుపోయాయి. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగాయి.**
**- అక్షరటుడే, ఇందూరు/కామారెడ్డి**

ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో వర్షప్రభావం అధికంగా ఉంది. కామారెడ్డి జిల్లాలో సుమారు 90 చోట్ల ఆర్‌అండ్‌బీ రోడ్లు ధ్వంసమైనట్లు అధికారులు గుర్తించారు. తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.3.5 కోట్లు, శాశ్వత పనులు చేపట్టడానికి రూ.62 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపారు. నిజామాబాద్ జిల్లాలో సుమారు 84 కిలోమీటర్ల మేర రోడ్లు పాడయ్యాయి. ఆరు కల్వర్టులు, నాలుగు వంతెనలు కూలిపోయాయి. రోడ్లు భవనాల శాఖకు సంబంధించి 45 కి.మీ. పంచాయతీరాజ్‌కు సంబంధించి 38 కిలోమీటర్ల మేర పాడైనట్లు అధికారులు తేల్చారు. దెబ్బతిన్నచోట మరమ్మతుల కోసం రూ.1.50 కోట్లు, నిర్మాణానికి రూ.7 కోట్లు ఖర్చు అవుతాయని అధికారులు అంచనాలు వేశారు.

### రైతులకు తీరని వేదన

భారీ వర్షాలు అన్నదాతలకు తీరని వేదన మిగిల్చాయి. వేల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. నిజామాబాద్ జిల్లాలో సుమారు 145 గ్రామాల్లో 41 వేల ఎకరాల పంట నష్టం జరిగిందని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. అత్యధికంగా సిరికొండ మండలంలో 3,500 ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. వరి 28వేల ఎకరాల్లో, సోయా 12 వేలు, మొక్కజొన్న 560, ఉద్యాన పంటలు 250, ఇతర పంటలు 96 ఎకరాల్లో నష్టపోయినట్లు అధికారులు చెప్పారు. కామారెడ్డి జిల్లావ్యాప్తంగా దాదాపు 45 వేల ఎకరాల్లో పంటలు నష్టపోయాయని అధికారులు తెలిపారు. పొలాల్లో ఇసుక మేటలు వేయడంతో పాటు రాళ్లు కొట్టుకువచ్చాయి.

### విద్యుత్ శాఖకు..

జిల్లాలో భారీ వర్షాలు, వరదలతో విద్యుత్ వ్యవస్థ చిన్నాభిన్నం అయింది. చాలా చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ట్రాన్స్‌ఫార్మర్లు పాడయ్యాయి. దీంతో పలు గ్రామాలు రెండు రోజులుగా అంధకారంలో ఉన్నాయి. అధికారులు వేగంగా విద్యుత్ లైన్లను పునరుద్ధరిస్తున్నారు. కామారెడ్డి జిల్లాలో 773 విద్యుత్ స్తంభాలు దెబ్బతినగా 147 ట్రాన్స్‌ఫార్మర్లు చెడిపోయాయి. 45 కిలోమీటర్ల మేర విద్యుత్ లైన్లు ఇబ్బతిన్నాయి. జిల్లా మొత్తంగా విద్యుత్ పునరుద్ధరణ కోసం రూ.2.9 కోట్లు అవసరమని అధికారులు పేర్కొన్నారు.

### తెగిపోయిన చెరువులు, కుంటలు

ఉమ్మడి జిల్లాలో వర్షాల ధాటికి పలు చెరువులు, కుంటలు తెగిపోయాయి. కొన్ని చెరువులకు బుంగలు పడ్డాయి. కామారెడ్డి జిల్లావ్యాప్తంగా 93 చోట్ల చెరువులు, కుంటలు డ్యామేజీ అయ్యాయి. పలు ప్రాజెక్ట్‌లకు సైతం నష్టం వాటిల్లింది. పనుల కోసం తక్షణం దాదాపు రూ.15 కోట్లు అవసరం కాగా.. శాశ్వతంగా పునరుద్ధరించడానికి రూ.34 కోట్లు కావాలని అధికారులు చెబుతున్నారు.



### కామారెడ్డి అతలాకుతలం

భారీ వర్షాలతో కామారెడ్డి జిల్లా కేంద్రం అతలాకుతలం అయింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని భయం గుప్పిట్లో జీవించారు. పట్టణంలోని జీఆర్ కాలనీ పూర్తిగా నీటిలో మునిగిపోయింది. ఇళ్లు ధ్వంసమయ్యాయి. సామగ్రి మొత్తం నీటిలో కొట్టుకుపోయింది. కట్టుబట్టలతో ప్రజలు రోడ్లపైకి వచ్చారు. కామారెడ్డి మున్సిపాలిటీలో వరద నష్టంతో జరిగిన పనులకు రూ.13 కోట్ల మేర నిధులు అవసరమని అధికారులు తెలిపారు. బాన్సువాడ మున్సిపాలిటీకి తక్షణ మరమ్మతుల కోసం రూ.35.86 లక్షలు, బిచ్కుందకు రూ.7.5 లక్షలు, ఎల్లారెడ్డికి రూ.20.30 లక్షలు తాత్కాలిక మరమ్మతుల కోసం అవసరమని పేర్కొన్నారు.

### స్పెషల్ ప్యాకేజీ వచ్చేనా...

కామారెడ్డి జిల్లాలో వర్షాలు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. సీఎం రేవంత్‌రెడ్డి ఏరియల్ సర్వే ద్వారా జిల్లాలో వరద నష్టాన్ని పరిశీలించారు. మంత్రి సీతక్క పట్టణంలో పర్యటించి బాధితులతో మాట్లాడారు. అధికారులతో సమీక్ష చేపట్టి వరద నష్టం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని శాఖలకు కలిపి దాదాపు రూ.155 కోట్లు అవసరమని అధికారులు అంచనా వేశారు. అయితే నిధులు విడుదల అవుతాయా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు సాగుతున్నాయి. ఈ సమావేశాల్లో జిల్లాలో జరిగిన వరద నష్టంపై ఎమ్మెల్యేలు మాట్లాడి నిధులు తీసుకురావాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ఎల్లారెడ్డి–బాన్సువాడ మధ్య బస్సులు ప్రారంభం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చాలా చోట్ల రోడ్లు కొట్టుకుపోయాయి. ముఖ్యంగా ఎల్లారెడ్డి నుంచి ప్రధాన పట్టణాలను కలిపే పలు మార్గాల్లో రోడ్లు ధ్వంసం కావడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఎల్లారెడ్డి-బాన్సువాడ మార్గంలో సైతం రాకపోకలు నిలిచిపోయాయి. రోడ్డు ధ్వంసం కావడంతో ఆర్టీసీ బస్సులు నడవలేదు. దీంతో అధికారులు గత రెండు రోజులుగా రోడ్లకు మరమ్మతులు చేపడుతున్నారు. ఈ క్రమంలో శనివారం రోడ్డు అందుబాటులోకి రావడంతో ఎల్లారెడ్డి - బాన్సువాడ మధ్య ఆర్టీసీ బస్సు సర్వీసులు పునఃప్రారంభం అయ్యాయి. ఈ రోడ్డును బాన్సువాడ డిపో మేనేజర్ పరిశీలించారు. ఎల్లారెడ్డి - కామారెడ్డి, ఎల్లారెడ్డి - మెదక్ రోడ్లు సైతం తెగిపోయాయి. దీంతో రాకపోకలు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్లకు కూడా మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకు రావాలని ప్రజలు కోరుతున్నారు.



## ఉద్యోగుల సమస్యలపై నిరసనలు చేపడతాం

**అక్షరటుడే, ఇందూరు:** ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఎంప్లాయీస్ జేఏసీ జిల్లా ఛైర్మన్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నాశెట్టి సుమన్ కుమార్ తెలిపారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డికి శనివారం ఉద్యమ కార్యాచరణపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ.. ఎంప్లాయీస్ జేఏసీ రాష్ట్ర కమిటీ విడుదల చేసిన కార్యాచరణకు అనుగుణంగా సెప్టెంబర్ 1వ తేదీ నుంచి జిల్లాలోనూ ఉద్యమం కొనసాగుతుందన్నారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఇప్పటికే ప్రభుత్వానికి పలుమార్లు నివేదించినట్లు పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎంప్లాయీస్ జేఏసీ కో-ఛైర్మన్లు రమణ్‌రెడ్డి, ధర్మేందర్, వైస్ ఛైర్మన్లు శేఖర్, ప్రశాంత్, రమణ చారి, జమీల్ ఉల్లా, ఫైనాన్స్ సెక్రెటరీ జాకీర్ హుస్సేన్ కార్యవర్గ సభ్యులు నారాయణరెడ్డి, శ్రీనివాస్, మాణిక్యం, మంగమ్మ, శ్రీవేణి, గీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఎస్సారెస్పీ వరద ఉధృతిపై సమీక్ష

**అక్షరటుడే, బాల్కొండ:** శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వరద ఉధృతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ప్రాజెక్టును సందర్శించారు. ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ఏరియాలతో పాటు దిగువన గల లోతట్టు గ్రామాల పరిస్థితి గురించి కలెక్టర్ ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శ్రీరాంసాగర్‌కు ఎగువన ఉన్న గైక్వాడ్, విష్ణుపురి ప్రాజెక్టులు, బాలేగాం, బాబ్లీ బ్యారేజీల నుంచి వరద వస్తోందని కలెక్టర్‌కు వివరించారు. అలాగే నిజాంసాగర్, గడ్డెన్నవాగు, కౌలాస్ నాలా, లెండి ప్రాజెక్టుల మిగులు జలాలు సైతం ఎస్సారెస్పీలో కలుస్తుండడంతో ఎస్సారెస్పీకి వరద పోటెత్తుతోందని వారు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రాజెక్టు పరీవాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండడంతో ఎగువ నుంచి శనివారం మధ్యాహ్నం సమయానికి 4.90 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందన్నారు. దీంతో 39 ఫ్లడ్‌గేట్లతో పాటు వరద కాలువ, కాకతీయ, సరస్వతి, లక్ష్మి మెయిన్ కెనాల్స్ ద్వారా దిగువకు 6 లక్షల క్యూసెక్కుల నీటిని వదులుతున్నామని కలెక్టర్ వివరించారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ సబ్ కలెక్టర్ ప్రజ్ఞాన్ మాల్వియా, ఎస్సారెస్పీ, ఇరిగేషన్ అధికారులు శ్రీనివాస్, రామారావు, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

## ఉద్యోగ విరమణ సహజం

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ సహజమని సీపీ సాయి చైతన్య అన్నారు. పోలీసు శాఖలో పనిచేసిన డి ఎల్లయ్య గౌడ్ (సీఐ, వీఆర్, నిజామాబాద్), టి నర్సింలు (ఎస్సై, సీసీఆర్‌బీ నిజామాబాద్ ), ఎల్ యాకుబ్ రెడ్డి (హెడ్ కానిస్టేబుల్, టాస్క్ ఫోర్స్, నిజామాబాద్) ఉద్యోగ విరమణ పొందారు. దీంతో శనివారం తన కార్యాలయంలో వారికి వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ పొందిన వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. పోలీస్‌శాఖలో ఎంతో పని ఒత్తిడితో పనిచేసి, ఎలాంటి రిమార్క్ లేకుండా ఉద్యోగ విరమణ పొందడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అదనపు సీపీ (అడ్మిన్) బస్వారెడ్డి, ఆర్ ఎస్సై శ్రీనివాస్, తిరుపతి, ఆఫీస్ సూపరింటెండెంట్ శంకర్, బషీర్ అహ్మద్, షకీల్ పాషా, తదితరులు పాల్గొన్నారు.




పదవీ విరమణ పొందిన సిబ్బందిని సన్మానిస్తున్న సీపీ సాయిచైతన్య

పనులను పరిశీలిస్తున్న కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



## పునరుద్ధరణ పనుల్లో వేగం పెంచాలి: కలెక్టర్

**అక్షరటుడే, కామారెడ్డి :** వరద నష్టం అనంతరం కాలనీల్లో చేపడుతున్న పునరుద్ధరణ పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. ఈ మేరకు శనివారం జీఆర్ కాలనీలో ఆయన పర్యటించారు. బాధిత కుటుంబాలతో మాట్లాడారు. కాలనీవాసులకు వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాలనీలో ఉన్న 48 ఇళ్లకు ఒక్కొక్క ఇంటికి 11,500 చొప్పున పరిహారం అందజేస్తున్నట్లు కలెక్టర్ ప్రకటించారు. అనంతరం వాగు ఉధృతికి ప్రధాన రహదారి తెగిపోవడంతో చేపడుతున్న పునరుద్ధరణ పనులను కలెక్టర్ పరిశీలించారు. సాయంత్రంలోపు ఒకవైపు రోడ్డు పనులు పూర్తిచేసి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. కాగా.. రోటరీ క్లబ్, ఆర్‌కే సంస్థల ఆధ్వర్యంలో కాలనీవాసులకు భోజనం ఏర్పాటు చేశారు.




## నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

**అక్షరటుడే, ఇందూరు:** భారీ వర్షాలను నష్ట పోయిన ప్రతి ఒక్కరిని ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య డిమాండ్ చేశారు. శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భారీ వర్షాలకు జిల్లాలోని 21 మండలాల్లో 42,098 ఎకరాల్లో పంటనష్టం వాటిల్లిందని అధికారులు చెబుతున్నారని, వాస్తవానికి క్షేత్రస్థాయిలో అధిక మొత్తంలో నష్ట జరిగిందన్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి, పంట నష్టంపై నివేదిక తయారు చేయాలన్నారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో న్యూ డెమోక్రసీ మండల కార్యదర్శి గంగాధర్, జిల్లా ఉపాధ్యక్షుడు సాయినాథ్, నాయకులు గంగదాస్, గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

## నష్టపోయిన కుటుంబాలను ఆదుకోవాలి




**అక్షరటుడే, బాన్సువాడ:** నస్రుల్లాబాద్ మండల పరిధిలో వర్షాలతో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 25వేల నష్టపరిహారం ఇవ్వాలని బీజేపీ మండల అధ్యక్షుడు చందూరి హన్మాండ్లు డిమాండ్ చేశారు. ఈమేరకు మండల కేంద్రంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. కూలిపోయిన ఇళ్ల స్థానంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఓబీసీ జిల్లా కార్యవర్గ సభ్యులు వడ్ల సతీష్, గిరిజన మోర్చా అసెంబ్లీ కన్వీనర్ శంకర్ నాయక్ మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, మండల ఉపాధ్యక్షుడు శేఖర్, పేరక రాములు, రాజు పాల్గొన్నారు.



## రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి మండలం తిమ్మాపూర్ తండాకు వెళ్లే బ్రిడ్జి పూర్తిగా ధ్వంసం కావడంతో రాకపోకలు నిలిచిపోయాయి. తండాప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మదన్ మోహన్ పంచాయతీరాజ్ అధికారులకు ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు శనివారం తిమ్మాపూర్ తండాకు వెళ్లే రోడ్డు దెబ్బతినగా.. ఎల్లారెడ్డి పంచాయతీరాజ్ శాఖ అధికారులు, కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా మరమ్మతులు చేయాలని ఎల్లారెడ్డి మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా కోరారు.

## వినాయక మండపం వద్ద అన్నదానం



**అక్షరటుడే, బాన్సువాడ:** వర్ని మండల కేంద్రంలోని మెహర్ బాబా కాలనీలో స్కంద పూర్వజ వినాయక మండలి ఆధ్వర్యంలో శనివారం అన్నదానం నిర్వహించారు. ముందుగా వినాయకుడికి భక్తితో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు శివ, మాల్యాద్రి, రాజు, వినయ్, బాలు, సుభాష్, శంకర్ పాల్గొన్నారు.


నగరంలోని ఖిల్లా రోడ్డులో మామ్మ దేవి గణేశ్ మండలిలో ప్రతిష్టించిన పద్మనాభ స్వామి గణపతి


ఆనంద్ నగర్ యువజన గణేశ్ మండలి ఆధ్వర్యంలో మల్టీగ్రెయిన్స్ గణపతి

# తీరొక్క గణనాథులు

వినాయక ఉత్సవాల్లో భాగంగా జిల్లాలో తీరొక్కరీతిలో గణనాథులను ప్రతిష్టించారు. అంతేకాకుండా వివిధ ఆలయాల సెట్టింగులు, ఆలోచింపజేసే డెకొరేషన్లతో ఆకట్టుకుంటున్నారు. పర్యావరణ రహిత గణపతి, చిరుధాన్యాల గణపతి, పద్మనాభ స్వామి వినాయకుడు తదితర రూపాల్లో గణనాథుడు దర్శనం ఇస్తున్నాడు - అక్షరటుడే, ఇందూరు


ఆర్మూర్‌లోని నల్ల పోచమ్మ గల్లిలో కాత్యయని యూత్ ఆధ్వర్యంలో..


రాణాగల్లి పెద్ద బజార్‌లోని శ్రీ మారుతి గణేశ్ మండలి..


ఆర్మూర్‌లోని చిన్న బజార్‌లో ఈగల్ యూత్ గణేశ్ మండలిలో..


నగరంలోని పెద్ద బజార్ గణేశ్ మండలి


వర్ని చౌరస్తాలో భక్త హిందూ యూత్ గణేశ్ మండలి ఆధ్వర్యంలో ప్రతిష్టించిన విభూది గణపతి


తిరుమల థియేటర్ ఎదురుగా హిష్మేశ్వర్ గణేశ్ మండలి


జెండాకు పూజలు చేస్తున్న భక్తులు


ఆలయంలో బారులు తీరిన భక్తులు

## జెండా జాతర ఉత్సవాలకు పోటెత్తిన భక్తులు

**అక్షరటుడే, ఇందూరు:** గోవింద నామస్మరణతో నగరంలోని జెండా బాలాజీ ఆలయం మార్మోగుతోంది. జెండాను దర్శించుకోవడానికి శనివారం భక్తులు బారులు తీరారు. ఆలయంలో వంశపారపర్య అర్చకులు అజయ్ సంగ్వాయి, సంజయ్ సంగ్వాయి, విజయ్ సంగ్వాయి నేతృత్వంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 15 రోజుల పాటు కొనసాగే జాతర పౌర్ణమి రోజు ముగియనుంది. ఈ ఏడాది చంద్రగ్రహణం రావడంతో ఉదయం 8 గంటలకే జెండాను ఆలయం నుంచి పులాంగ్‌కు తరలించనున్నారు. అయితే చంద్రగ్రహణం రోజు పులాంగ్ వద్ద ఎటువంటి పూజా కార్యక్రమాలు ఉండవని అర్చకులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. మరుసటి రోజు నుంచి ఎప్పటిలాగే కొనసాగుతాయని పేర్కొన్నారు. జెండా జాతరలో నుడా ఛైర్మన్ కేశవేణు కుటుంబ సమేతంగా పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం గోల్ హనుమాన్ ఆలయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.


పూజలు నిర్వహిస్తున్న నుడా ఛైర్మన్ కేశ వేణు

## ఓటరు జాబితా సవరణపై అవగాహన



**అక్షరటుడే, కోటగిరి:** మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం ఓటరు జాబితా సవరణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో చందర్ మాట్లాడుతూ.. ఓటరుజాబితాలో ఏమైనా సవరణలు ఉంటే ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. వివాహాలు జరిగినవాళ్లు, మరణించిన వాళ్ల పేర్లు ఉంటే తొలగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పుప్పాల శంకర్, విఠల్, గంగాధర్, ఎజాజ్ ఖాన్, ప్రకాష్ పటేల్, కాశ గౌడ్, శేఖర్, రాజు, ధనరాజ్, రాంబాబు, సజ్జత్, దత్తు, నాగేష్, సంజు, అశోక్, రాజు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



## వ్యక్తిగత పరిశుభ్రతతో రోగాలు దూరం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా రోగాలు రాకుండా నివారించవచ్చని వైద్యుడు శరత్ కుమార్ అన్నారు. మత్మల్ ప్రథమ ఆరోగ్య కేంద్రం ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో గురుకుల పాఠశాలలో శనివారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, కాలక్రమేనా వచ్చే వ్యాధుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సంతోష్, ఏఎన్ఎం ఇందిరా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఘనవ్యర్థాల నిర్వహణపై అవగాహన

**అక్షరటుడే, ఆర్మూర్:** ప్రభుత్వం చేపట్టిన 100 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా శనివారం పట్టణంలోని 1, 16వ వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ రాజు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరుగుతూ సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించేయాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై జాగ్రత్త ఉండాలని సూచించా రు. వీధికుక్కల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల ను వివరించారు. ఆయన వెంట సానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేందర్, పర్యావరణ ఇంజినీర్ పూర్ణమౌళి, ఆఫీసర్ అవినాష్, సానిటరీ జవాన్లు, మెప్మా ఆర్పీలు తదితరులున్నారు.

## అత్తింటి వేధింపులు తాళలేక గృహిణి ఆత్మహత్య

**అక్షరటుడే, ఇందల్వాయి:** మండలంలోని నల్లవెల్లి గ్రామానికి చెం దిన మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై సందీప్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నీరడి హేమలత అలియాస్ సంధ్య (32) అనే గృహిణి అత్తింటి వేధింపులు తాళలే క వాగులో దూకి ఆత్మహత్య చేసుకుంది. కొర ట్ పల్లి గ్రామానికి చెందిన హేమలతను 11 సంవత్సరాల క్రితం నల్లవెల్లి గ్రామానికి చెందిన నీరడి గంగాధర్‌కు ఇచ్చి వివాహం చేశారు. కాగా కొంత కాలంగా అదనపు కట్నం తీసుకురావాలని సదరు మహిళను భర్త గంగాధర్, అత్త ఎల్లవ్వ హింసిస్తున్నారు. మృతురాలికి పిల్లలు లేకపోవడంతో హాస్పిటల్‌లో చూపించడానికి డబ్బులు ఇవ్వమని వేధించేవారని సమా చారం. మృతురాలి తల్లిదండ్రులు రెండు మూడుసార్లు మాట్లాడి సర్ది చెప్పినా భర్త గంగాధర్ తన ప్రవర్తన మార్చుకోలేదు. శుక్రవారం సాయంత్రం హేమలతను ఇష్టం వచ్చినట్లు కొట్టడంతో ఆమె జీవితంపై విరక్తితో గౌరారం శివారులోని వాగులో దూకి ఆత్మహత్య చేసుకుంది.


వరద బాధితులను పరామర్శిస్తున్న ఎంపీ సురేశ్ షెట్కార్



వరద బాధిత కుటుంబాలను నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న మాజీ ఎంపీ


# వరద బాధితులను ఆదుకోవాలి

ఉమ్మడిజిల్లాలో వరద బీభత్సం సృష్టించింది. మూడురోజులుగా కురిసిన వర్షా ల కారణంగా రైతాంగం తీవ్రంగా నష్టపోయింది. వాగులువంకలు పొంగిపొర్లాయి. ప్రాజెక్టులు పొంగిపొర్లడంతో పంటలన్నీ నీటమునిగాయి. దీంతో రైతాంగాన్ని ఆదుకోవాలని విపక్షాలు, ప్రజాసంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. – అక్షరటుడే,నెట్‌వర్క్


కోతకు గురైన రోడ్డును ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే


పంటలను పరిశీలిస్తున్న సీపీఐ, సీపీఐఎంఎల్, రైతు సంఘాల నాయకులు

## బాధిత కుటుంబాలకు బీఆర్ఎస్ నేతల ఆర్థిక సహాయం



**అక్షరటుడే, కోటగిరి :** భారీ వర్షాలకు మండలకేంద్రంలోని గంగపుత్ర కాలనీలో పలు ఇళ్లు దెబ్బతిన్నాయి. దీంతో బీఆర్ఎస్ నాయకులు శనివారం పరిశీలించారు. అద్దె ఇంట్లో ఆశ్రయం పొందుతున్న పల్లికొండ సాయిలు, అనిత దంపతులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే, ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రెవెన్యూ, పంచాయతీ అధికారులకు సమాచారం ఇచ్చి, వినతిపత్రం అందించారు. అలాగే గాండ్ల సాయిలు ఇల్లు కూలిపోవడంతో పరిశీలించారు. రూ.5వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ మండల నాయకులు శ్రీనివాస్, కిషన్, రవికుమార్, సహకార సొసైటీ ఉపాధ్యక్షుడు గజేందర్, సమీర్, శంకర్ గౌడ్, బాబు పటేల్, సంతోష్, నజీర్, మహేష్ రెడ్డి, చిన్న అరవింద్, గౌతమ్, మామిడి నవీన్, యోగేష్, సందీప్, బోయ సంఘ అధ్యక్షుడు సాయిలు, పోశెట్టి, నాని, కుమ్మరి పోశెట్టి, గంగాధర్ పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ జీపీ కార్మికుడి మృతి

**అక్షరటుడే, ఇందల్వాయి:** మండలంలోని ఇందల్వాయి తండా జీపీలో కార్మికుడిగా పనిచేస్తున్న ఎడపల్లి సాయిలు చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. వారంరోజుల క్రితం గ్రామంలో వీధిలైట్లు బిగిస్తున్న సమయంలో విద్యుత్‌షాక్‌కు గురైన సాయిలుకు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. అయితే చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శనివారం మృతి చెందాడు. నిరుపేద కుటుంబానికి చెందిన సాయిలు మృతి చెందడంతో ఆయన భార్య, ఇద్దరు కుమార్తెలు ఇంటి పెద్ద దిక్కు కోల్పోయారని.. కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు పేర్కొన్నారు.